సూర్య నేటి దినపత్రిక
www.suryaa.com
18వ వసంతంలోకి..
www.suryaa.com

EVENING EDITION

నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com

4PM
www.suryaa.com
గురువారం
06-02-2025
పేజీలు: 02


## చీటింగ్‌లో చంద్రబాబు పీహెచ్‌డీ చేశారు



ఏపీ సీఎం చంద్రబాబుపై వైసీపీ అధినేత జగన్ తీవ్ర విమర్శలు చేశారు. 'చంద్రబాబు చీటింగ్ లో పీహెచ్‌డీ తీసుకున్నారు. చంద్రబాబు నటన ముందు ఎన్టీఆర్ కూడా పనికి రారు. ఆయన నటనకు ఏ అవార్డు ఇచ్చిన సరిపోదు. చంద్రబాబును నమ్మడం అంటే చంద్రముఖిని నిద్రలేపడమే. చంద్రబాబును నమ్మవద్దని ఎన్నికల ముందు ప్రజలకు చెప్పా..కానీ ప్రజలు వినలేదు. ఇప్పుడు ఇబ్బంది పడుతున్నారు"అని అన్నారు.

# కొత్త జెర్సీ విడుదల చేసిన బీసీసీఐ



ఇంగ్లండ్ తో జరగనున్న మూడు వన్డేల సిరీస్‌కు ముందుగా భారత జెర్సీలో మార్పులు చేసిన బీసీసీఐ, కొత్త జెర్సీని అధికారికంగా విడుదల చేసింది.భారత అభిమానులను ఆకట్టుకునేలా ఈ కొత్త డిజైన్‌ను రూపొందించారు.గత జెర్సీలో భుజం నుంచి చేతుల వరకు కాషాయ రంగు ఉండగా, తాజా డిజైన్‌లో భారత త్రివర్ణ పతాకం ప్రతిబింబించేలా భుజాలపై ప్రత్యేక శైలిలో రంగులను పొందుపరిచారు. ఇది భారత క్రికెట్ చరిత్రలో ఓ ప్రత్యేక గుర్తుగా నిలుస్తుందని భావిస్తున్నారు. ఈ మార్పులు ఆటగాళ్లలోనే కాదు, అభిమానుల్లోనూ దేశభక్తి భావాన్ని మరింత పెంచేలా ఉన్నాయి. కొత్త జెర్సీతో రోహిత్ శర్మ ఫొటో లేదు. ఈ కొత్త జెర్సీకి వన్డే జట్టులోని ఆటగాళ్లు ధరించి ఫోటోలకు పోజులిచ్చారు.అనంతరం బీసీసీఐ ఈ ఫొటోలను ఎక్స్‌లో పంచుకుంది. అయితే, ఈ ఫొటోలలో కోహ్లీ సహా ఇతర క్రికెటర్లు కనిపించినప్పటికీ, రోహిత్ శర్మ ఫొటో మాత్రం లేదు.దీంతో ఇది సోషల్ మీడియాలో చర్చనీయాంశమైంది. ఇప్పటికే ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్‌కు సిద్ధమైన భారత జట్టు, తొలి వన్డేను నాగ్‌పూర్ వేదికగా ఆడనుంది. రెండు జట్లు నగరానికి చేరుకుని ప్రాక్టీస్‌ను ప్రారంభించాయి. 4-1 తేడాతో టీ20 సిరీస్‌ను విజయవంతంగా ముగించిన భారత జట్టు, వన్డేల్లోనూ సత్తా చాటాలని భావిస్తోంది.





## ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో భారీగా బంగారం పట్టివేత

దేశ రాజధాని ఢిల్లీలోని ఇందిరా గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో భారీగా బంగారం పట్టుబడింది. మిలాన్ నుంచి వచ్చిన ఇద్దరు ప్రయాణికుల నుంచి రూ.కోట్ల విలువ చేసే బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు కస్టమ్స్ అధికారులు తెలిపారు. జమ్ము కశ్మీర్‌కు చెందిన 43, 45 ఏళ్ల వయసు గల ఇద్దరు వ్యక్తులు మిలాన్ నుంచి ఢిల్లీకి వచ్చారు. ఎయిర్‌పోర్ట్‌లో వారి లగేజీని స్కాన్ చేయగా అనుమానాస్పదంగా ఏమీ కనిపించలేదు. అయితే ఆ ఇద్దరు ప్రయాణికుల్ని వ్యక్తిగతంగా తనిఖీ చేయగా సుమారు 10 కిలోల బంగారం పట్టుబడింది. ప్రత్యేకంగా రూపొందించిన రెండు నడుము బెల్ట్‌లో బంగారు నాణేలను ప్లాస్టిక్ ఎన్వలప్‌లో చుట్టి అక్రమంగా రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. పట్టుబడిన పసిడి విలువ దాదాపు రూ.7.8 కోట్ల వరకూ ఉంటుందని అంచనా. బంగారాన్ని స్వాధీనం చేసుకున్న కస్టమ్స్ అధికారులు.. ఆ ఇద్దరు ప్రయాణికుల్ని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

# ఢిల్లీ పీఠం కమలానిదే!

## బీజేపీకి జైకొట్టిన పలు సర్వే సంస్థలు

ఢిల్లీ పీఠం కమలానిదేనని ఎగ్జిట్ పోల్స్ తేల్చేశాయి. హోరాహోరీగా సాగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కమలం విజయం సాధించబోతోందని సర్వే సంస్థలు ప్రకటించాయి. ప్రధాన సర్వే సంస్థలన్నీ బీజేపీకి జై కొట్టగా, కేకే, వీ ప్రిసైడ్ సర్వే సంస్థలు ఆప్ మరోసారి గెలుస్తుందని తేల్చాయి. కాంగ్రెస్ పార్టీ ఖాతా తెరిచే అవకాశం కష్టమేనని తెలిపాయి. ఢిల్లీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న బీజేపీ మొదటి నుంచే పటిష్ట ప్రణాళికతో ముందుకెళ్లింది. ఆర్ఎస్ఎస్ శ్రేణులు కూడా వార్డుల వారీగా ప్రచారం నిర్వహించాయి. ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌తోపాటు ఏపీ సీఎం చంద్రబాబు తదితరులు బీజేపీ తరపున ప్రచారం చేశారు. ఫలితంగా 27 సంవత్సరాల తర్వాత ఢిల్లీలో మళ్లీ బీజేపీ అధికారంలోకి వచ్చే అవకాశాలున్నాయని సర్వే సంస్థలు చెబుతున్నాయి. ఇండియా కూటమిలో కీలక భాగస్వామ్య పక్షాలైన కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ ఈ ఎన్నికల్లో వేర్వేరుగా బరిలో నిలిచాయి. ఆప్ కంటే ముందు సుదీర్ఘకాలం ఢిల్లీలో కాంగ్రెస్ అధికారంలో ఉంది. ఆ తర్వాత గడిచిన రెండు ఎన్నికల్లో కనీసం ఒక్క స్థానాన్ని కూడా గెలవలేకపోయింది. ఈసారి కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గే విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. గత రెండు ఎన్నికలతో పోలిస్తే కాంగ్రెస్ ఓటు శాతం ఈ సారి పెరిగే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఆప్ ఓట్లను కాంగ్రెస్ చీల్చడం వల్ల బీజేపీ గెలుపు మరింత సులభమైందని విశ్లేషకులు చెబుతున్నారు.

HT ASSEMBLY ELECTIONS 2025 ELECTION STORIES

DELHI EXIT POLLS

TOTAL SEATS 70 | TARGET 36

| SOURCE | BJP | AAP | INC |
|---|---|---|---|
| Peoples Pulse | 51-60 | 10-19 | 00 |
| MATRIZE | 35-40 | 32-37 | 0-1 |
| People's Insight | 40-44 | 25-29 | 0-1 |
| P-Marq | 39-49 | 21-31 | 0-1 |
| JVC | 39-45 | 22-31 | 0-2 |
| Chanakya Strategies | 39-44 | 25-28 | 2-3 |

*Exit polls are often wrong.
#ElectionsWithHT (at 6:55 PM)

కాంగ్రెస్ ఓటు శాతం పెరిగినప్పటికీ సీట్లు మాత్రం వచ్చే అవకాశం లేదని సర్వే సంస్థల ఎగ్జిట్ పోల్స్ ద్వారా తెలుస్తోంది. మరోవైపు గతంలో ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను సరిగ్గా అంచనా వేసి దేశవ్యాప్తంగా పేరును సంపాదించుకున్న కేకే సర్వే మాత్రం అందరికంటే భిన్నంగా ఫలితాలను ప్రకటించింది. ఆమ్ ఆద్మీ పార్టీ 44 స్థానాలతో మరోసారి అధికారంలోకి వస్తుందని, బీజేపీ కేవలం 26 స్థానాలకే పరిమితం అవుతుందని తెలిపింది. వీ ప్రిసైడ్ అనే సంస్థ కూడా 46 నుంచి 52 స్థానాలతో మరోసారి ఆప్ అధికారంలోకి వస్తుందని, బీజేపీ 18 నుంచి 23 స్థానాలతో సరిపెట్టుకుంటుందని తెలిపింది. ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్, ముఖ్యమంత్రి అతిషి, మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోదియాల విజయం కష్టమేనని కేకే సహా మరికొన్ని సర్వేలు తెలిపాయి. అసలు ఫలితాలు ఈ నెల 8న వెలువడతాయి. ఢిల్లీ అసెంబ్లీ పరిధిలోని మొత్తం 70 నియోజకవర్గాల్లో బుధవారం ఓటింగ్ జరిగింది. 60.10 శాతం పోలింగ్ నమోదైంది. 699 మంది అభ్యర్థుల భవితవ్యాన్ని ఓటర్లు ఈవీఎంలలో నిక్షిప్తం చేశారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, కేంద్ర మంత్రులు ఎస్.జైశంకర్, హర్దీప్ సింగ్ పురి, ఢిల్లీ ముఖ్యమంత్రి అతిషి, ఆమ్ ఆద్మీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్, కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా, సీఈసీ రాజీవ్ కుమార్ సహా మరికొందరు ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పాకిస్థాన్ నుంచి శరణార్థులుగా ఢిల్లీకి వచ్చి భారత పౌరసత్వం పొందిన హిందువులు తొలిసారిగా ఓటేశారు.



## నా బలమేమిటో తెలుసు



'సినిమా ముఖ్యోద్దేశ్యం నటించి మెప్పించడం. తెరపై అందంగా కనిపించడం కాదు. అందుకే నేను గ్లామర్ కంటే అభినయప్రధాన పాత్రలకే ఎక్కువ ప్రాధాన్యతనిస్తా. తక్కువ సినిమాలు చేసినా సరే నాణ్యమైన కథల్ని ఎంచుకోవాలన్నదే నా అభిమతం' అని చెప్పింది కన్నడ భామ శ్రద్ధా శ్రీనాథ్. ఆమె కథానాయికగా నటించిన తాజా చిత్రం 'డాకు మహారాజ్'. బాబీ కొల్లి దర్శకుడు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ నిర్మించింది. ఈ నెల 12న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా బుధవారం శ్రద్ధా శ్రీనాథ్ పాత్రికేయులతో సినిమా విశేషాలను పంచుకుంది. ఈ సినిమాలో తాను నందిని అనే పాత్రలో కనిపిస్తానని, సున్నితమైన వ్యక్తిత్వం కలిగిన మహిళగా లోతైన భావోద్వేగాలతో తన క్యారెక్టర్‌ను తీర్చిదిద్దారని చెప్పింది. 'ఇప్పటి వరకు నేను విభిన్నమైన కథల్లో నటించా. అయితే 'డాకు మహారాజ్' పాత్రం ఓ పూర్తి ప్యాకేజీలా ఉంటుంది. కామెడీ, యాక్షన్, డ్రామా, ఎమోషన్స్ అన్నీ సమపాళ్లలో కుదిరాయి.ఈ సినిమాకు సొంతంగా డబ్బింగ్ చెప్పాను. సినిమా కథల ఎంపికలో చాలా సెలెక్టివ్‌గా ఉంటా. నటిగా నా బలం ఏమిటో బాగా తెలుసు. తెరపై అందాలొలికించే గ్లామర్ పాత్రల్లో కనిపించడం నాకు ఇష్టం ఉండదు. నటన ద్వారానే ప్రేక్షకులకు గుర్తుండిపోవాలన్నది నా లక్ష్యం' అని చెప్పింది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ తనకు 'జెర్సీ'వంటి మరపురాని విజయాన్ని అందించిందని, ఈ సినిమాలోని తన పాత్ర కూడా అదే స్థాయిలో ప్రేక్షకులకు చేరువవుతుందనే నమ్మకం ఉందని శ్రద్ధా శ్రీనాథ్ ధీమా వ్యక్తం చేసింది.

## సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సీఎల్పీ అత్యవసర భేటీ

ఎన్నికల హామీల అమలు, కుల గణనపై విపక్షాల నుండి విమర్శల దాడి కొనసాగుతున్న నేపథ్యంలో.. నష్టనివారణపై చర్యలు చేపట్టింది తెలంగాణ కాంగ్రెస్ పార్టీ. దీంతో గురువారం(ఫిబ్రవరి 6) ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కీలక సమావేశం ఏర్పాటు చేసింది కాంగ్రెస్. హైదరాబాద్‌లోని MCRHRDలో ఈ ఉదయం 11 గంటలకు కాంగ్రెస్ లెజిస్లేటివ్ పార్టీ సమావేశం కానుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరగనున్న భేటీకి రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ దీపాదాస్‌మున్షీతోపాటు పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ హాజరవుతారు. ఈ సమావేశంలో కీలక అంశాలపై ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు దిశానిర్దేశం చేయనుంది పార్టీ. బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణ నిర్ణయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంపై చర్చిస్తారు. స్థానిక సంస్థల ఎన్నికలపై ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేయనున్నారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. ఈ సమావేశంలో మొదటగా జిల్లాల వారీగా సమావేశాలు ఏర్పాటు చేస్తారు. అనంతరం సమావేశం సీఎల్పీగా మారుస్తారు.



పార్టీ అంతర్గత వ్యవహారాలపై సమావేశంలో చర్చించనున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి. MLAలు, మంత్రుల మధ్య సమన్వయం పై సూచనలు చేస్తారు. మరోవైపు, సమావేశంలో తమకు ఒక్కొక్కరికి 5 నిమిషాలు వ్యక్తిగతంగా సమయం ఇవ్వాలని కోరారు ఎమ్మెల్యేలు. ఇదిలాఉండగా, ఈరోజు సాయంత్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళ్లనున్నారు. ముఖ్యమంత్రితో పాటు పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ కూడా ఢిల్లీ వెళ్తున్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో భేటీ కానున్నారు సీఎం రేవంత్ రెడ్డి. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన, ఎస్సీ వర్గీకరణపై అధిష్టానానికి వివరించనున్నారు. అలాగే, రెండు రోజులపాటు ఢిల్లీలోనే ఉండనున్న సీఎం..కీలక అంశాలపై పార్టీ పెద్దలతో చర్చించే అవకాశం ఉంది.

నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM

# 20 లక్షల ఉద్యోగాలు తప్పక ఇస్తాం..
# ఎన్నికల హామీ నిలబెట్టుకుంటాం



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఐటీ అభివృద్ధికి అండగా ఉండాలని కేంద్ర మంత్రులను కోరినట్టు ఏపీ ఐటీశాఖమంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఢిల్లీలో పలువురు కేంద్రమంత్రులను కలిసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ గురించి కేంద్ర మంత్రులకు వివరించానన్నారు. వివిధ శాఖల మంత్రులతో ఆయా సమస్యలపై చర్చించామని, విద్యాసంస్థల్లో మౌలిక వసతుల కల్పనకు సాయం చేయాలనికోరినట్లు ఆయన తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రస్తుతం కొనసాగుతున్న ప్రాజెక్టులపై రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్ ఆరా తీసినట్లు తెలిపారు. కేంద్రం నుంచి రావాల్సిన బిల్లులు త్వరగా ఇవ్వాలని, విశాఖ స్టీల్ ప్లాంట్‌కు ప్యాకేజీ ఇచ్చిన కేంద్రానికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. తమ ప్రభుత్వం 20లక్షల ఉద్యోగాలు ఇస్తామనే హామీకి కట్టుబడి ఉన్నట్లు స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఐటీ సేవలు, గ్రీన్ హైడ్రోజన్, రెన్యువబుల్ ఎనర్జీ విస్తరిస్తామని పేర్కొన్నారు. రాష్ట్రాభివృద్ధిలో భాగంగా పలువురిని కలుస్తామని అన్నారు. ఫీడ్ బ్యాక్ తీసుకునేందుకే ప్రశాంత్ కిశోర్‌ను కలిశామని, గత ప్రభుత్వ పాలనలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలు భారీగా తగ్గారని మంత్రి లోకేష్ అన్నారు. ఐదేళ్లలో పాఠశాలల్లో చదివే విద్యార్థులు 45 లక్షల నుంచి 32 లక్షలకు తగ్గినట్లు లోకేశ్ మీడియాకు వివరించారు.

### తెలంగాణ 'టాస్' పరీక్షల ఫీజు గడువు ఫిబ్రవరి 13 వరకు పెంపు


తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం (టాస్) పరిధిలో ఏప్రిల్ నెలలో పది, ఇంటర్ పరీక్షలు నిర్వహించనున్న సంగతి తెలిసిందే. ఈ పరీక్షలకు చెల్లించవల్సిన ఫీజు గడువును పొడిగిస్తూ ప్రకటన జారీ చేసింది. తాజా ప్రకటన మేరకు రూ.50 ఆలస్య రుసుంతో ఫిబ్రవరి 10వ తేదీ వరకు ఫీజు చెల్లించవచ్చని టాస్ సంచాలకుడు పీవీ శ్రీహరి ఓ ప్రటకనలో తెలిపారు. తత్కాల్ కింద ఫిబ్రవరి 11 నుంచి 13వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు.



## ఏడేళ్ల చిన్నారికి కుట్లు వేయడానికి
# బదులు ఫెవికాల్ వేసిన నర్స్

ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యుల నిర్వాకం పదే పదే ప్రజల్లో ఆందోళన కలిగిస్తుంది. సర్కార్ జీతం తీసుకుంటున్న కొందరు వైద్యులు ప్రజల ప్రాణాలు కాపాడాల్సింది పోయి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ వారి ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. తాజాగా సర్కార్ దవాఖానా నర్స్ చేసిన పని ప్రజల్లో తీవ్ర ఆగ్రహాన్ని కలిగించింది. తీవ్రమైన గాయాలతో బాధపడుతున్న ఏడేళ్ల చిన్నారిని చికిత్స కోసం ఆసుపత్రికి తీసుకువచ్చారు. కానీ అక్కడి నర్సు చేసిన పనికి అధికారులు ఆమెను సస్పెండ్ చేశారు. ఏం జరిగిందో పూర్తి వివరాల్లోకి వెళితే.. కర్ణాటకలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చేరిన ఏడేళ్ల బాలుడి చెంపపై గాయమై కుట్లు వేయాల్సి వచ్చింది. కానీ హాస్పిటల్ నర్సు నిర్లక్ష్యంగా కుట్లు వేయడానికి బదులుగా అతని గాయంపై ఫెవికోల్ వేసింది. అయితే ఈ తప్పకు ఆసుపత్రి ఆ నర్సును సస్పెండ్ చేసింది. ఈ సంఘటన బుధవారం అంటే ఫిబ్రవరి 5న జరిగింది. కాగా సోషల్ మీడియాలో వార్త దావానంలా వ్యాపించింది. గురుకిషన్ అన్నప్ప హోసమణి అనే 7 ఏళ్ల బాలుడి ముఖం మీద లోతైన గాయం అయింది. దాంతో అతన్ని చికిత్స కోసం ఆసుపత్రికి తీసుకువచ్చారు. గాయం చాలా లోతుగా ఉండటం వల్ల కుట్లు వేయాల్సి వచ్చింది. కానీ, నర్సు ఫెవికాల్ వేసింది. సదరు నర్స్ చేసిన పనిని ఆ చిన్నారి తల్లిదండ్రులు వీడియో తీశారు. అనంతరం సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన నర్స్ పేరు జ్యోతి అని చెప్పారు. అయితే, ఆ చిన్నారి వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది.

## బిగ్ బాస్ ఫేమ్ శేఖర్ బాషాపై మరో కేసు..
# ఫిర్యాదు చేసిన శ్రేష్టి వర్మ



డ్రగ్స్ కేసులో తనను ఇరికించేందుకు ప్రయత్నించాడంటూ లావణ్య బిగ్ బాస్ ఫేమ్ శేఖర్ బాషాపై పోలీసులకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఇందుకు సంబంధించిన ఆడియో ఆధారాలను పోలీసులకు ఆమె అందజేసింది. దీంతో పోలీసులు శేఖర్ బాషాపై కేసు నమోదు చేశారు. తాజాగా ఈ బిగ్ బాస్ నటుడిపై నార్సింగి పీస్ లో మరో కేసు నమోదైంది. ప్రముఖ కొరియోగ్రాఫర్ శ్రేష్టి వర్మ శేఖర్ బాషా పై ఫిర్యాదు చేసింది. గతంలో ఆమె కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ పై ఫిర్యాదు చేసి వార్తల్లో నిలిచింది. ఇప్పుడు శేఖర్ బాషా పై కూడా కేసు పెట్టింది. జానీ మాస్టర్ కేసులో విచారణ జరుగుతుండగా కాల్ రికార్డు లీక్ చేశాడని శ్రేష్టి వర్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన పరువుకు భంగం వాటిల్లేలా , కొన్ని యూట్యూబ్ ఛానెల్స్ మాట్లాడుతున్నాడని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. దీంతో పోలీసులు శేఖర్ బాషాపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఉద్దేశ పూర్వకంగా, దురుద్దేశం తోనే బిగ్ బాస్ నటుడు ప్రయివేటు కాల్ రికార్డ్ లు లీక్ చేశాడని పోలీసులు ఎఫ్ఐఆర్ లో పేర్కొన్నారు. శేఖర్ బాషా వ్యక్తిగత మొబైల్ తోపాటు, అతనితో ఉన్న ఇతర ఎలక్ట్రానిక్ డివైజస్ లు సీజ్ చేయాలని బాధితురాలు కోరింది. దీంతో BNS యాక్ట్ సెక్షన్ 79 ,67, ఐటీ యాక్ట్ 72 కింద పోలీసులు శేఖర్ బాషా పై కేసు నమోదు చేశారు.

## ఇకనైనా మొద్దు నిద్ర వీడాలి..
# సీఎం రేవంత్‌కు కేటీఆర్ హితవు



కాంగ్రెస్ సర్కారు పాలనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర సచివాలయంలోనే కాదు.. చివరికి.. గ్రామ సచివాలయాల్లో కూడా పాలన పడకేసిందని విమర్శించారు. గాడితప్పిన పంచాయతీల్లో పరిపాలన సాగేదెట్లా..? సమస్యల సుడిగుండంలో ఉన్న ప్రజల కష్టాలు తీరేదెట్లా అని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 12,789 పంచాయతీలు ఉండగా.. దాదాపు 80 శాతం సమస్యలతో సతమతమవుతున్నాయి. పంచాయతీ ఎన్నికలు నిర్వహించకపోవడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు రాక.. పల్లెల్లో పాలన పడకేసింది. ప్రత్యేకాధికారుల పాలనలో చాలా పంచాయతీలు నిర్వహణ లేక పారిశుద్ధ్యం, వీధి దీపాల మరమ్మతులకూ నిధుల కటకట ఎదుర్కొంటున్నాయి. ఈ పరిస్థితిపైనే కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పారిశుద్ధ్యం పడకేయడంతో ప్రజలు రోగాల పాలవుతున్నారని.. వీధి దీపాలు వెలగకపోవడంతో పల్లె సీమలను చిమ్మ చీకట్లు ఆవరించాయని అన్నారు. దెబ్బతిన్న రోడ్లను రిపేర్ చేయడానికి పైసల్లేవని.. పంచాయతీ ట్రాక్టర్‌కు డీజిల్ పోసే దిక్కులేదని కాంగ్రెస్ సర్కార్ తీరుపై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదేనా ప్రజాపాలనా.. ఇదేనా ఇందిరమ్మ రాజ్యం అని ప్రశ్నించారు. ప్రత్యేకాధికారుల పాలనకు ఏడాదైనా కళ్లుతెరవరా అని నిలదీశారు. బీఆర్ఎస్ హయాంలో పల్లె ప్రగతితో రూపురేఖలు మారాయని.. నాడు పంచాయతీలకు ఠంచన్ గా కడుపునిండా నిధులు వచ్చాయని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది.. మళ్లీ పల్లె ప్రజలకు పాత కష్టాలు తెచ్చిందని విమర్శించారు. నిన్నటి దాకా పెండింగ్ బిల్లులు రాక మాజీ సర్పంచ్ లు అప్పులపాలయ్యారని.. నేడు జేబుల నుంచి ఖర్చుచేసిన కార్యదర్శులకు తిప్పలు తప్పడం లేదని అన్నారు. ఇకనైనా ముఖ్యమంత్రి మొద్దునిద్ర వీడాలని.. గ్రామాల్లో సమస్యల పంచాయితీని తీర్చాలని పిలుపునిచ్చారు.



# ఐటీ చెల్లిస్తే ఉచిత రేషన్ కట్!

ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన(పీఎంజీకేఏవై) కింద అనర్హులైన లబ్ధిదారులను ఏరివేసేందుకు ఆహార మంత్రిత్వశాఖకు ఆదాయ పన్ను(ఐటీ) శాఖ వివరాలను అందజేయనున్నది. ఆదాయ పన్ను చెల్లించని పేద కుటుంబాలకు పీఎంజీకేఏవై కింద ఉచిత రేషన్‌ను ప్రభుత్వం అందజేస్తున్నది. 2026 ఆర్థిక సంవత్సరంలో పీఎంజీకేఏవై కోసం రూ. 2.03 లక్షల కోట్లను కేంద్రం బడ్జెట్‌లో కేటాయించింది. ఆహార, ప్రజా పంపిణీ శాఖ(డీఎఫ్‌పీడీ) సంయుక్త కార్యదర్శికి ఆదాయ పన్ను (సిస్టమ్స్) శాఖ డైరెక్టర్ జనరల్ (డీజీఐటీ) సమాచారం అందచేస్తారని సీబీడీటీ తెలిపింది. లబ్ధిదారుల ఆధార్ నంబర్ లేదా పాన్‌తోపాటు మదింపు సంవత్సరాల వివరాలను సమర్పిస్తే, నిర్ణీత మొత్తం కంటే అధిక ఆదాయం కలిగిన వారి డాటాను డీజీఐటీ సిస్టమ్స్ అందజేస్తుంది. అనర్హుల వివరాలను గుర్తించడంలో ఈ డాటా కీలకం కానుంది.

## ఆర్‌సీ16 సెట్స్‌లో
# కూతురితో రాంచరణ్

టాలీవుడ్ స్టార్ హీరో రాంచరణ్ బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైన్‌లో పెట్టాడని తెలిసిందే. వీటిలో మోస్ట్ ఎవెయిటెడ్ ప్రాజెక్ట్ ఉప్పెన ఫేం బుచ్చి బాబు సాన డైరెక్ట్ చేస్తున్న ఆర్‌సీ 16 (RC 16. షూటింగ్ దశలో ఉన్న ఈ మూవీ మూడో షెడ్యూల్ హైదరాబాద్‌లో జరుగనుందని వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. తాజాగా ఈ మూవీ షూట్ లొకేషన్ ఫొటో ఒకటి నెట్టింట షేర్ చేశాడు. ఆర్‌సీ 16 సెట్స్‌లో కూతురు క్లింకారాను ఎత్తుకున్న స్టిల్ షేర్ చేస్తూ.. మై లిటిల్ క్యూట్ గెస్ట్ అంటూ క్యాప్షన్ పెట్టాడు. ఈ లొకేషన్ ఎక్కడనేది పక్కన పెడితే తండ్రీకూతుళ్ల ఫొటోను చూసి ఫుల్ ఎంజాయ్ చేస్తున్నారు అభిమానులు. లొకేషన్ చూసిన అభిమానులు రంగస్థలం మేనియా రిపీట్ కాబోతుందంటూ కామెంట్లు పెడుతున్నారు. బుచ్చిబాబు టీం ఈ చిత్రానికి PEDDI అనే టైటిల్‌ను ఫిక్స్ చేసిందని తెలుస్తుండగా.. దీనిపై త్వరలోనే అధికారికంగా టైటిల్ అనౌన్స్‌మెంట్ చేయబోతున్నారని ఇన్‌సైడ్ టాక్.



## ఈసారి పరీక్షా పే చర్చ వెరీ స్పెషల్..
# ప్రధానితోపాటు దీపిక, సద్గురు, విక్రాంత్ మస్సే



విద్యార్థుల్లో పరీక్షల భయాన్ని పోగొట్టేందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఏటా ప్రత్యేకంగా 'పరీక్షా పే చర్చ' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ ఏడాది కూడా ఫిబ్రవరి 10వ తేదీన పరీక్ష పే చర్చ జరగనుంది. న్యూఢిల్లీలోని భారత్ మండపంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. అయితే ఈ సారి పరీక్షా పే చర్చ కార్యక్రమం చాలా స్పెషల్ కానుంది. ఎందుకంటే ప్రధానితోపాటు పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమంలో సందడి చేయబోతున్నారు. బాలీవుడ్ నటీనటులు, ఇతర రంగాలకు చెందిన ప్రముఖులు ఇందులో పాల్గొననున్నట్లు అధికారులు తాజాగా వెల్లడించారు. ఆధ్యాత్మిక వేత్త సద్గురు జగ్గీ వాసుదేవ్, బాలీవుడ్ సెలబ్రిటీలు దీపికా పదుకొణె, విక్రాంత్ మస్సే, భూమి పడ్నేకర్, స్టార్ బాక్సర్ మేరీ కోమ్, పారా అథ్లెట్ అవని లేఖరా, రచయిత రుజుతా దివేకర్, ఎడెల్‌వీస్ మ్యూచువల్ ఫండ్ సీఈవో రాధికా గుప్తా, మానసిక నిపుణురాలు సోనాలీ సబర్వాల్, టెక్నికల్ గురూజీ గౌరవ్ చౌధరీ, ఫుడ్ ఫార్మర్ రేవంత్ హిమత్‌సింగ్కా వంటి ప్రముఖులు పాల్గొని బోర్డు పరీక్షల్లో ఒత్తిడిని తగ్గించుకోవడానికి విద్యార్థులకు చిట్కాలు అందజేస్తారు. తమ అనుభవాలను కూడా విద్యార్థులతో పంచుకుని వారిలో స్ఫూర్తి నింపనున్నారు. కాగా, పరీక్షా పే చర్చ 2025 కోసం గతేడాది డిసెంబర్ 14న రిజిస్ట్రేషన్లు ప్రారంభమైన విషయం తెలిసిందే. జనవరి 24 ఉదయం 10 గంటల వరకూ ఈ ప్రక్రియ కొనసాగింది. ఈ కార్యక్రమం కోసం దేశవ్యాప్తంగా 6 నుంచి 12వ తరగతి చదివే సుమారు 2,500 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. వీరంతా ప్రధానితో జరిగే చర్చా కార్యక్రమంలో నేరుగా పాల్గొంటారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు మోదీ సమాధానాలిస్తారు. వారికి పలు సూచనలు కూడా చేస్తారు. ఇక కార్యక్రమంలో పాల్గొనే విద్యార్థులందరికీ పీపీసీ కిట్స్‌ను కేంద్ర విద్యా శాఖ అందించనుంది.